బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చాలి

కాచిగూడ, మార్చి 14: 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం బర్కత్‌పురా కార్యాలయంలో గుజ్జ సత్యం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు కోరుతూ ఈనెల 19వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీలో అఖిలపక్ష ఎంపీల మద్దతు సమీకరించడానికి చలో పార్లమెంట్ ను ఈనెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా సమగ్ర కులగాలను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని,కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఓబీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వెంకటేశ్, నరేందర్, శ్రీకాంత్ గౌడ్, పండరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

గొలుసు దొంగ అరెస్ట్

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 14: జల్సాల కోసం బంగారు గొలుసును తస్కరించిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, కేపీహెచ్‌బీ సీఐ రాజశేఖర్‌రెడ్డి గొలుసు దొంగతనం చేసిన వ్యక్తి వివరాలను వెల్లడించారు. ఈ నెల 12న కేపీహెచ్‌బీ ఈడబ్ల్యూఎస్ 998లో అంజలి దంపతులు నివసిస్తున్నారు. ఉదయాన్నే ఓ గుర్తు తెలియని వ్యక్తి మంచినీళ్లు అడిగి, మహిళ ఇంట్లోకి వెళ్లగానే వెనుక నుంచి వెళ్లి మెడలోని బంగారు గొలుసును తస్కరించి పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా, గొలుసు తస్కరించింది ఉప్పు సాయి తేజ (26)గా గుర్తించారు. అరెస్టు చేసి బంగారు మంగళసూత్రం, సెల్‌ఫోన్, ఒక పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వారాసిగూడలో కాముడి దహనంలో పాల్గొన్న గంగపుత్ర సంఘం నాయకులు

హోలీ.. రంగోళి

- సందడిగా రంగుల పండుగ వేడుకలు
- సంబురాల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు
- ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్న ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు
- వాడవాడలా కాముడి దహనాలు

బొల్లారం, మార్చి 14: హోలీ పండుగను పురస్కరించుకుని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి బోయిన్‌పల్లిలోని వారి నివాసంలో శుక్రవారం హోలీ సంబురాలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, పిల్లలతో కలిసి నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ సందడిగా గడిపారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజలు సుఖశాంతులతో హోలీ పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. తన చిన్ననాటి నుండి హోలీ సంబురాలు గొప్పగా జరుపుకుంటూ సందడి చేస్తామని అన్నారు. మల్లారెడ్డి మాట్లాడుతూ రాబోయే సంవత్సరం తమ దంపతుల 50వ గోల్డెన్ జూబ్లీ వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుతామని అన్నారు. వేడుకల్లో బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ యువ నాయకులు భద్రారెడ్డి, టింకుగౌడ్, అజయ్, రాజుయాదవ్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో ఘనంగా హోలీ వేడుకలు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్‌కు సీతాఫల్మండి బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గరికపాటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు రవి, రాజేష్ తదితరులు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో..

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయం వద్ద హోలీ జరిపారు. ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల ఆత్మగౌరవం సంక్షేమం, పునర్నిర్మాణం విషయంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంబురాల్లో ఫోరం రాష్ట్ర కమిటీ సభ్యులు సుదర్శన్ యాదవ్, గగన్‌కుమార్, జానకిరెడ్డి, మల్లూరి అనిల్, దయానంద్, ఆర్కే భూపాల్, జగన్‌యాదవ్, రాంబాబు, భాస్కర్, నరసింహాచారి, శ్రీధర్ పాల్గొన్నారు.

మోండా డివిజన్ బండిమెట్‌లో హోలీ

మారేడ్‌పల్లి: మోండా డివిజన్ బండిమెట్‌లో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ జరుపుకున్నారు. యవత ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. మోండా డివిజన్ బండిమెట్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జి.నాగేందర్ (నాగులు) ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోలీ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఎంతో సంతోషంగా జరుపుకునే పండుగ హోళీ అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, శ్రీనాథ్, వెంకట్, అమర్ పాల్గొన్నారు.

అడ్డగుట్టలో హోలీ వేడుకలు

అడ్డగుట్ట: అడ్డగుట్టలో హోలీ వేడుకలు జరిగాయి. అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్ నక్క మధు ఆధ్వర్యంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో డివిజన్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు రంగులను పూసుకొని తీన్మార్ పాటలకు స్టెప్పులు వేశారు. అడ్డగుట్ట, తుకారం గేట్, శాంతినగర్ ప్రాంతాల్లో హోలీ వేడుకల్లో ఉత్సవాలను అట్టహాసంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్తయ్యగౌడ్, వసంత, ఎల్లయ్య, అమర్ బాన్సోడె, రామప్ప చారి, కిట్టు, దేవయ్య, నర్సింగ్, అయోధ్య, మల్లేష్, వడ్లూరి రవి, నరేష్, ఆనంద్, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

బీకేగూడలో హోలీ వేడుకలు

అమీర్పేట్: మాజీ కార్పొరేటర్ ఎన్.శేషు కుమారి నివాసంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో బీకేగూడలోని శేషుకుమారి నివాసానికి చేరుకొని సంప్రదాయ పద్ధతిలో రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు కూతురు నరసింహ సహా బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి

బండిమెట్ హోలీ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావును కలిసి హోలీ శుభాకాంక్షలు తెలియజేసిన మెట్టుగూడ కార్పొరేటర్ సునీత, బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు

శేషుకుమారి నివాసంలో హోలీ వేడుకలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఎమ్మెల్యే పద్మారావుకు హోలీ శుభాకాంక్షలు తెలుపుతున్న గరికపాటి చంద్రశేఖర్ తదితరులు

శాంతినగర్‌లో నిర్వహించిన హోలీ వేడుకల్లో పాల్గొన్న అనంతరం నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

వారాసిగూడలో హోలీ వేడుకలో పాల్గొన్న నాయకులు, స్థానికులు

భక్తిశ్రద్ధలతో కోటి గోటి తలంబ్రాల సేవ

కోటి గోటి తలంబ్రాల సేవలో భక్తులు

అమీర్పేట్ మార్చి 14: భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణం ఉత్సవానికి భక్తులు భక్తి పూర్వకంగా సమర్పించుకునే కోటి గోటి తలంబ్రాల సేవ మోడల్‌కాలనీ కమ్యూనిటీ హాల్లో భక్తిశ్రద్ధలతో జరిగింది. భద్రాచలం నుండి వచ్చిన వడ్లను భక్తులు తమ గోటితో ఒలిచి తలంబ్రాలుగా చేసి స్వామివారికి సమర్పిస్తారు. సనత్‌నగర్‌కు చెందిన సనాతన ధర్మబాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో భద్రాచలంలో శ్రీరాముల వారికి జరిగే కల్యాణోత్సవానికి 'గోటి తలంబ్రాలు' సిద్ధం చేసే బృహత్తర కార్యక్రమాన్ని శుక్రవారం మోడల్‌కాలనీలో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భద్రాచలం నుండి వచ్చిన వడ్లను తారక నామం పట్టిస్తూ గోటితో వలచిన బియ్యాన్ని స్వామి వారి కల్యాణోత్సవానికి ఉపయోగించే తలంబ్రాలుగా వీటిని సిద్ధం చేయడం జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. భక్తులే స్వామివారికి తలంబ్రాలను సిద్ధం చేసే ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావడం తమ అదృష్టంగా భావిస్తున్నట్టు సేవలో పాల్గొన్న భక్తులు తెలిపారు.

ఆదివాసీ సంఘీభావ వేదిక ఆవిర్భావం

ఆవిర్భావ సభలో పాల్గొన్న సంఘం నాయకులు

ముషీరాబాద్, మార్చి 14: ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి హైదరాబాద్ జిల్లా ఆవిర్భావ సభ శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్లో జరిగింది. వేదిక కన్వీనర్స్‌గా దళిత లిబరేషన్ ఫ్రంట్ నేత ఇందిర, ప్రజా కళామండలి నాయకురాలు రాణి, చైతన్య మహిళా సంఘం జయక్క, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం నేత రవి, ఏఐఎఫ్టీయూ మల్లేష్, ఐఏపీఎల్ సురేష్‌కుమార్, పీడీఎస్‌యూ మహేష్. అమరుల బంధు మిత్రుల సంఘం సత్య , తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాంబాబు ఎంపికయ్యారు. పౌరహక్కుల సంఘం హైదరాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ కన్వీనర్‌గా కొనసాగుతారు. కోఆర్డినేటర్ కమిటీలో రైతు కూలి సంఘం జి.వెంకటేశ్వరరావు ఎంపికైనట్లు తెలిపారు. ఆదివాసులపై మారణ హోమాన్ని నిలిపివేయాలని సహజ వరుణుల దోపిడిని నిలిపివేయాలని పర్యావరణాన్ని రక్షించాలని పోలీస్ క్యాంపులను ఎత్తివేయాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ముషీరాబాద్, మార్చి 14: తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళా దినోత్సవం జరిగింది. వివిధ రంగాల మహిళా ప్రముఖులను, మ్యారేజ్‌బ్యూరో నిర్వాహకులను అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ మ్యారేజ్‌బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందించినట్లు తెలిపారు. వచ్చేనెల 29వ తేదీన రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో పురస్కారాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, శివతేజ, ఐ రవీందర్ గౌడ్, మధుసూదన్ గౌడ్, ఈశ్వర్ నేత, శేఖర్ గౌడ్, గడ్డం సరిత, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న ముగ్గురి అరెస్ట్

స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితులు

ముషీరాబాద్, మార్చి 14: హోలీ సందర్భంగా మద్యం షాపులు బందు చేయడంతో, దొడ్డి దారిన మద్యం అమ్ముతున్న ముగ్గురిని చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు పోలీసుల కథనం ప్రకారం బాగ్‌లింగంపల్లిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న అంబర్పేట్‌కు చెందిన జావిద్ ఖాన్ (30), అచ్చయ్యనగర్‌కు సయ్యద్ సాజిద్, బాగ్‌లింగంపల్లికి చెందిన కుమ్మరి శివకుమార్ మద్యం బాటిల్ అమ్ముతున్నారు. బ్లాక్‌లో మద్యం అమ్మి అధిక లాభాలు పొందాలనే ఉద్దేశంతో అమ్మకాలు సాగిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 78 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. చిక్కడపల్లి ఇన్స్పెక్టర్. రాజు నాయక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్‌టీఎల్‌లో మట్టిపోస్తున్న టిప్పర్ డ్రైవర్‌పై కేసు

కుత్బుల్లాపూర్, మార్చి14: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లి ఫాక్స్ సాగర్ చెరువు, ఎఫ్‌టీఎల్ స్థలంలో ఇటీవల కొంతమంది వ్యక్తులు టిప్పర్లతో మట్టిపోస్తూ చదును చేసి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో హైడ్రాకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు శుక్రవారం పేట్‌బషీరాబాద్ పోలీసులు టిప్పర్ వాహనం డ్రైవర్ రాములపై కేసు నమోదు చేసి టిప్పర్‌ను సీజ్‌చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరా పార్కులో హోలీ సంబురాలు

హోలీ సంబురాల్లో బండారు విజయలక్ష్మికి మెమెంటోను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, మార్చి 14: హోలీ కష్టాలను తొలగించి అందరి జీవితాలలో రంగులమయమైన ఆనందాన్ని నింపాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. హోలీ పురస్కరించుకొని ఇందిరా పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్కులో హోలీ వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, దైవజ్ఞశర్మ, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, బీజేపీ నేత బండారు విజయలక్ష్మి పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులు టి.కృష్ణమోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సి.ప్రభాకర్‌యాదవ్, శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు బి.నరేందర్, రమేష్‌గుప్తా, కోశాధికారి గాజుల శంకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు చందర్, సాయిరెడ్డి, కోఆర్డినేటర్లు సరోజిని, ఆర్కే శ్రీనివాస్, రమేష్, లక్ష్మి, బీఆర్ఎస్ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు రాంచందర్, పరిమళ్‌కుమార్, వెంకటేష్, మహేందర్‌బాబు, దిలీప్‌యాదవ్, గంట శ్రీనివాస్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు దుర్మార్గం

సీఎం రేవంత్‌రెడ్డిపై చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

సీఎంపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని చిక్కడపల్లి సీఐకి ఫిర్యాదు చేస్తున్న యువ నాయకుడు జయసింహ, బీఆర్ఎస్ నాయకులు

కవాడిగూడ, మార్చి 14: దేశంలోనే అగ్రభాగంలో తెలంగాణ రాష్ట్రాన్ని నిలిపిన మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. వ్యాఖ్యలను తక్షణమే వెనక్కు తీసుకొని కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు ముఠా జయసింహ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం చిక్కడపల్లి సీఐ బి.రాజునాయక్‌ను కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఫిర్యాదు అందజేశారు. అనంతరం జయసింహ మాట్లాడుతూ పరిపాలన చేతకాని సీఎం ఏం మాట్లాడాలో తెలియక కేసీఆర్‌ను అగౌరవ పరుస్తున్నారని మండిపడ్డారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చి, ప్రజా పాలన పేరుతో ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అని వాటిని అమలు చేయకుండా ప్రజలను వంచించిన సీఎంను రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. 14 నెలల పాలనలో రాష్ట్రాన్ని పాతాళానికి తొక్కేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లి అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పీట వేసిన కేసీఆర్‌ను అవమానిస్తే రానున్న రోజుల్లో రేవంత్‌రెడ్డికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మీడియా ఇన్‌చార్జి మచ్చకుర్తి ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గుప్తా, పున్న సత్యానారాయణ, ఆకుల శ్రీనివాస్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ముదిగొండ మురళి, శంకర్, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

16న 'జర్నలిజం మహిళలు సవాళ్లు' అంశంపై సెమినార్

కవాడిగూడ, మార్చి 14: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 16న చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య, హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు బి.అరుణ్‌కుమార్, బి.జగదీశ్వర్ తెలిపారు. ఓయూ జర్నలిజం రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజాషా, ఎన్డీటీవీ తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి ఉమాసుధీర్, విశిష్ఠ అతిథులుగా సీనియర్ జర్నలిస్ట్ ప్రియాచౌదరి, స్వతంత్ర జర్నలిస్ట్ తులసిచంద్, టీన్యూస్ జర్నలిస్ట్ స్వేచ్ఛ, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్కే సలీమా పాల్గొంటారని తెలిపారు. 'జర్నలిజం మహిళలు సవాళ్లు' అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. కార్యక్రమానికి సమన్వయ కర్తలుగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.నాగవాణి, పి.విజయ, మణిమాల, రోజారాణి వ్యవహరిస్తారని చెప్పారు. వివిధ పత్రికలు, టీవీ చానళ్లలో పనిచేస్తున్న సీనియర్ మహిళా జర్నలిస్ట్‌లకు ఆత్మీయ సత్కారం ఉంటుందని తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మియాపూర్, మార్చి 14: వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నిజామాబాద్, మాధవనగర్‌కు చెందిన రాఘవేందర్‌రావు(60) భార్య విజయలక్ష్మితో కలిసి దీప్తి శ్రీనగర్‌కాలనీలో ఉంటున్నాడు. కాలనీలో విజయ స్వగృహ ఫుడ్స్ నిర్వహిస్తున్నాడు. రాఘవేంద్రరావు మనుమడు అర్జున్ పుట్టినరోజు కావడంతో వేడుకల నిమిత్తం కుటుంబసభ్యులందరూ కలిసి మధ్యాహ్నం సమయంలో షాపింగ్‌కు వెళ్లారు. రాఘవేంద్రరావును కూడా రమ్మనగా నేను ఇంట్లోనే ఉంటానని తెలిపాడు. సాయంత్ర కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూడగా.. బెడ్ రూమ్ ఉరివేసుకొని కనిపించాడు. తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా.. అప్పటికే రాఘవేంద్రరావు మృతి చెంది ఉన్నాడు. మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కిందికి దించి చూడగా మృతి చెంది ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. గత కొంతకాలంగా రాఘవేంద్రరావు అనారోగ్యంతో బాధపడుతున్నాడని, భరించలేక ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఇంకా ఇతర ఏమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.